## హత్య కేసులో అల్లుడికి జీవిత ఖైదు

- అక్కకు పదేండ్ల జైలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ముస్తాబాద్, సెప్టెంబర్ 25: ఎవరైనా నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మామ హత్య కేసులో అల్లుడికి జీవితఖైదు, అక్కకు పదేండ్ల జైలుశిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత బుధవారం తీర్పు చెప్పారని వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండల కేంద్రంలో పండుగ రాజం, మరియమ్మ అక్కాతమ్ముళ్లు. కొన్నేండ్లుగా ఆస్తి పంపకాల విషయంలో వీరికి గొడవలు జరుగుతున్నాయి. ఎలాగైనా రాజంను చంపాలని మరియమ్మతోపాటు ఆమె కొడుకు మల్లేశం పథకం పన్నారు. ఈ క్రమంలో 2020 సెప్టెంబర్ ఒకటిన వీరిద్దరూ రాజంను గొడ్డలితో నరికిచంపారు. అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేసి.. మరియమ్మ, మల్లేశంను రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో 15 మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించారు. నేరం రుజువుకావడంతో మల్లేశంకు జీవితఖైదుతోపాటు ₹2,500 జరిమానా, మరియమ్మకి పదేండ్ల జైలుశిక్షతోపాటు ₹2,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పీపీ నర్సింగారావు, కోర్టు కానిస్టేబుళ్లు నవీన్, దేవేందర్, సీఎంఎస్ కానిస్టేబుల్ నరేందర్‌ను ఎస్పీ అభినందించారు.

## భక్తుల సౌకర్యార్థమే ఆక్రమణల తొలగింపు

- రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి

వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్‌లో రాజన్న వసతి సముదాయాలకు ఆనుకొని ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

వేములవాడ, సెప్టెంబర్ 25: వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థమే జాతర గ్రౌండ్ ఆక్రమణ చేసిన వ్యాపారులతో మాట్లాడి స్వచ్ఛందంగా తొలగించామని రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. జాతర గ్రౌండ్‌లోని రాజన్న వసతి సముదాయాలను ఆనుకొని పెట్టుకున్న డబ్బాలు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారాల దుకాణాలను బుధవా రం ఆలయ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, టీటీడీ ధర్మశాలలో విచారణ కార్యాలయం ద్వారా గదుల కేటాయింపు ఉండగా చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు 300 వసతి గదులు స్వామివారికి ఉన్నాయని తెలిపారు. భక్తులు వచ్చే దారిలో ఆక్రమణలు ఉండడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మురుగుకాలువలపై కూడా ఆక్రమణలు ఉండడంతో మురుగునీరు చిన్నపాటి వర్షానికి రహదారిపైకి వస్తుందన్నారు. వసతి గదిలో విడిది చేసిన భక్తులు మురుగునీటి గుండా ఆలయానికి చేరుకొని పరిసరాల శుభ్రతపై ప్రశ్నిస్తున్నందున వ్యాపారులతో మాట్లాడి స్వచ్ఛందంగా తొలగించే విధంగా చర్య లు తీసుకున్నామని తెలిపారు. ఇకపై ఆక్రమణలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుటామని చెప్పారు. అయితే వ్యాపారులు తమకు అవకాశం కల్పించాలని మా ఉపాధిని దెబ్బతీయవద్దని ఈవో వద్దకు వచ్చి వేడుకున్నారు. స్వామివారి వాణిజ్య సమ్ముదాయాల కేటాయింపులో తగిన స్థానం కల్పిస్తామని, పట్టణవాసులు, వ్యాపారులు భక్తులకు ఇబ్బంది కలగకుండా చేసే చర్యలో సహకరించాలని ఆయన కోరారు. అక్రమంగా వేసిన వాటిని సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో ఈఈ రాజేశ్, ఏఈవో శ్రావణ్ కుమార్, డీఈ మహిపాల్ రెడ్డి, పర్యవేక్షకులు వరి నర్సయ్య, విజయ్ కుమార్, ఏఈలు లక్ష్మణ్ రావు, రామ్‌కిషన్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు కూరగాయల శ్రీనివాస్, శ్యామ్ తదితరులున్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్మికులు

## మమ్మల్ని పర్మినెంట్ చేయండి

- కనీస వేతనం రూ.26 వేలు అందించండి
- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా
- సమస్యలు పరిష్కరించకుంటే మున్సిపల్ డైరెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరిక

కలెక్టరేట్, సెప్టెంబర్ 25 : మున్సిపల్‌శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తమను పర్మినెంట్ చేసి.. కనీస వేతనం ₹26 వేలు అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ప్రమాదబీమా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల కార్మికులు ధర్నా చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మున్సిపల్ అధికారులు, యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని.. లేదంటే అక్టోబర్ 8న చలో హైదరాబాద్ మున్సిపల్ డైరెక్టర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుర్రం అశోక్ మండిపడ్డారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కాసారపు శంకర్, దొబ్బల లచ్చయ్య, బత్తుల దేవరాజు, రెడ్డిమల్ల రాజయ్య, వెల్పుల బాలయ్య, ఉమ, శంకరవ్వ, లక్ష్మి, రవి, నరేశ్ ఉన్నారు.

### పండుగలకైనా జీతం ఇవ్వండి

- వేములవాడలో మున్సిపల్ కార్మికుల ధర్నా

వేములవాడ, సెప్టెంబర్ 25: బతుకమ్మ, దసరా పండుగలకైనా జీతాలివ్వాలని మున్సిపల్ కార్మికులు బుధవారం వేములవాడ మూలవాగు వంతెన వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం ఏరియా వేతనాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటివరకు నిలిచిపోయిన నాలుగు నెలల వేతనాలు కూడా ఇవ్వాలని కోరారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడమే కాకుండా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఏఐటీయూసీ జిల్లా నాయకులు అజ్జు, విజయ్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు మరాఠి రాజయ్య, ప్రధాన కార్యదర్శి పందుల మల్లేశం, కార్మికులు గాజుల వజ్రమ్మ, వాల్మీకి, ఊర్మిల, నరేశ్, చంద్రయ్య, కనకవ్వ, దుర్గయ్య, లక్ష్మీరాజం, లక్ష్మణ్, రాజు, కిరణ్, శ్రీనివాస్, భారతమ్మ తదితరులున్నారు.

వేములవాడ మూలవాగు వంతెన వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగ జేఏసీ కార్యవర్గం ఎన్నిక

వేములవాడ : రాష్ట్ర దేవాలయ ఉద్యోగుల జేఏసీ సమావేశానికి హాజరైన పలు ఆలయాల ఉద్యోగులు

వేములవాడ, సెప్టెంబర్ 25: వేములవాడలో జరిగిన రాష్ట్ర దేవాదాయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌవాధ్యక్షుడిగా మారం జగదీశ్వర్, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా గజవెల్లి రమేశ్‌బాబు (ఏఈవో యాదగిరిగుట్ట), డిప్యూటీ చైర్మన్లుగా బుద్ది శ్రీనివాస్(ఏఈవో, కొండగట్టు), ఆర్ సుదర్శన్ (ఏఈవో, కొమురవెల్లి), ఉపాధ్యాయుల చంద్రశేఖర్ (సీనియర్ అసిస్టెంట్, వేములవాడ) గౌరవ సలహాదారులుగా జే దయాకర్‌రెడ్డి (డీఈ, యాదగిరిగుట్ట), డీ భాస్కర్ (డిప్యూటీ ఈవో యాదగిరిగుట్ట), స్థల సాయి (భద్రాచలం), సంకెపల్లి హరికిషన్ (ఏఈవో, వేములవాడ) జే కృష్ణ (ఏఈవో, యాదగిరిగుట్ట), నమిలకొండ ఉమేశ్ శర్మ (ఇన్‌చార్జి స్థానాచార్యులు, వేములవాడ), వరి నర్సయ్య (పర్యవేక్షకుడు, వేములవాడ), ఎస్ శ్రీరాములు (పర్యవేక్షకుడు, వేములవాడ), కే వెంకటాచార్యులు (ప్రధాన అర్చకుడు, యాదగిరిగుట్ట), టీ కపీంద్రాచారి (స్థానాచార్యుడు, కొండగట్టు), మదన్‌కుమార్ (ముఖ్య అర్చకుడు, బాసర), వైస్ చైర్మన్లుగా ఎం మల్లికార్జున్ (ప్రధాన అర్చకుడు, కొమురవెల్లి), కే నిరంజన్ (పర్యవేక్షకుడు, భద్రాచలం), ప్రధాన కార్యదర్శిగా ఫీచర రంగారావు (వేములవాడ), సహాయ కార్యదర్శులుగా సువర్ణ, రాధా కిషన్, గట్టు శ్రవణ్‌కుమార్, మంద స్వామి, డీ సునీల్‌కుమార్, నవీన్‌శర్మ, ఎడ్ల శివ సాయి, కార్యదర్శులుగా గంగా శ్రీనివాస్, కిరణ్‌కుమార్, ఆచార్యులు, కోశాధికారిగా సురేంద్రాచార్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీధరశర్మ, గోలి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా కట్కూరి వెంకటయ్య, నాగుల మహేశ్, మాధవాచార్యులు, క్రీడల కార్యదర్శిగా కూరగాయల శ్రీనివాస్‌ను కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

- ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పక్కన సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

చందుర్తి,సెప్టెంబర్ 25: రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మల్యాల గ్రామంలో పది లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. మెరుగైన విద్యుత్ సేవలను అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఇప్పటికే పెరుగుతున్న డిమాండ్‌కు తగినట్లు సరఫరాపై దృష్టి సారించిన యంత్రాంగం లోవోల్టేజీ సమస్యలను రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని కొత్త ఉప కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. ఇక్కడ సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, సెస్ ఏఈ మహేశ్, నాయకులు పులి సత్యం, దొంగరి భూమయ్య, పొంశెట్టి వెంకటేశ్ ఉన్నారు.

### దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 25: రానున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు ఘనంగా చేయాలి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో రైతు వేదిక ఆవరణలో వేములవాడ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న దసరా బతుకమ్మ దీపావళి వేడుకలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జిలు ప్రభుత్వం తరపున చూడాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీవో శేషాద్రి, డీఎల్పీవో గీత, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ఆటో యూనియన్ ఎన్నికల సందడి

- పోటీలో ప్రస్తుత, మాజీ అధ్యక్షులు
- రసవత్తరంగా డివిజన్ ఎన్నికలు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 25: వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ ఎన్నికల సందడి నెలకొంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేములవాడ డివిజన్ స్థాయి ఆటో యూనియన్ ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్ష పదవి ముగియడంతో ఈనెల 30న ఎన్నికలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల24 నుంచి నామినేషన్ ప్రక్రియ మొదలు కాగా, ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. వారికి ఎన్నికల నిర్వాహకులు గుర్తులను సైతం కేటాయించారు. వేములవాడ పట్టణంతోపాటు పలు మండలాల్లో ఆటో యూనియన్ ఎన్నికల సందండి నెలకొంది. వేములవాడ డివిజన్ ఆటో యూనియన్‌లో దాదాపు 1600 మంది ఆటో కార్మికులు సభ్యత్వాలు తీసుకున్నారు. వేములవా డ డివిజన్ ఆటో యూనియన్ పరిధిలో వేములవాడ, వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, బోయినపల్లి, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి మండలాలతోపాటు సిరిసిల్ల లో కొంతమంది ఆటో కార్మికుల సభ్యత్వాలున్నాయి. దాదాపు 30 సంవత్సరాలుగా ఈ ఎన్నికలు జరుగుతుండటం విశేషం. గతంలో ఆటో యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవంగా కాగా ప్రస్తుతం అధ్యక్ష పదవి కోసం పోటీ నెలకొంది.

### బరిలో ముగ్గురు

వేములవాడ డివిజన్ ఆటోయూనియన్ ఎన్నికల్లో ఈసారి ముగ్గురు పోటీలో ఉన్నారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన బత్తుల దేవరాజు, చంద్రగిరి శ్రీనివాస్‌తోపాటు సయ్యద్ ఉమర్‌లు బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో ఇద్దరి మధ్యే పోటీఉండగా దేవరాజు విజయం సాధించారు. ఈసారి గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ మరోసారి అధ్యక్ష పదవిలో రేసులో ఉన్నాడు. ఆటో యూనియన్ ఏర్పడిన్నప్పటి నుంచి శ్రీనివాస్‌కు పోటీ లేకుండా గెలిచారు. కానీ గతంలో దేవరాజు విజయం సాధించడంతో ఈసారి మళ్లీ గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

## రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రై సిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
91827 77711

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

### ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

### ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

### టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏఐ సిటీ పూర్తయిన తర్వాత ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన భవనాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అయినప్పటికీ అసంపూర్తి, ప్రైవేటు భవనాన్ని ఎంచుకోవడం వెనక అసలు ఉద్దేశం వేరే ఉందన్న చర్చ జరుగుతున్నది.

# స్కైవల్ ఫార్మేషన్‌తోనే కూలిన చెట్లు

- పునరుద్ధరణ జరగాలంటే వందేండ్లు
- నిర్ధారణకు వచ్చిన అటవీ శాస్త్రవేత్తలు
- విపత్తును పసికట్టిన వన్యప్రాణులు

ములుగు, సెప్టెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంతోపాటు అరేబియా సముద్రంలో గత నెల 31న ఏర్పడిన తుఫాన్‌ల కారణంగా గంటకు 125 కిలోమీటర్ల వేగంతో వీచిన భారీ గాలుల ఒత్తిడితో ఏర్పడిన స్కైవల్ ఫార్మేషన్‌తోనే ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవిలో భారీ ఎత్తున చెట్లు నేలకూలాయని అటవీ శాఖ పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో అటవీశాఖ అధికారులతోపాటు 10 నుంచి 12 సంస్థలకు చెందిన నిష్ణాతులైన శాస్త్రవేత్తలతో వర్క్‌షాపు నిర్వహించి విధ్వంసానికి గల ప్రధాన కారణాలను అంచనా వేశారు. తాడ్వాయి, మేడారం, పస్రా అటవీ ప్రాంతంలో ఆగస్టు 31న జరిగిన దుర్ఘటన వల్ల 332 హెక్టార్లలో అడవికి నష్టం జరిగి 50 వేలకు పైగా చెట్లు నేలకూలాయని చెప్పారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.30 కోట్ల నష్టం జరిగిందని, కలపతో కలుపుకుంటే రూ.100 కోట్ల నష్టం వరకు ఉంటుందని తెలిపారు. పర్యావరణం దృష్టితో చూస్తే రూ.100 కోట్లకు పైగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. దట్టమైన 100 నుంచి 200 ఏండ్ల చెట్లు కూలాయని, అంతటి దట్టమైన అడవి తిరిగి రూపొందాలంటే వందేండ్లు పడుతుందని వివరించారు. నష్టం జరిగిన ప్రదేశంలో చెట్లను కాపాడుకుంటే ఐదేండ్లలో అడవి ఏర్పడుతుందని, భారీ వృక్షాలు కావాలంటే చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల్లో ఒకేసారి వచ్చిన తుఫాను వల్ల భారీ ఒత్తిడితో గాలులు వీచి మేఘాలు ఒక దానిపై ఒకటి వచ్చిన సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు నిర్ధారణకు వచ్చారని చెప్పారు. నష్టం జరిగిన రోజు సంఘటన ప్రాంతంలో 25 నుంచి 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతోపాటు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, కొంత ప్రాంతంలో 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్టు కనుగొన్నామని తెలిపారు. వర్క్ షాపులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఎవరూ ఇంతటి తీవ్రతను చూడలేదని చెప్పారని వివరించారు. గతంలో మధ్యప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవుల్లోని అడవుల్లో కొద్ది ప్రాంతంలో చెట్లకు నష్టం జరిగిందని, ప్రస్తుతం తాడ్వాయి అడవుల్లో భారీ మొత్తంలో నష్టం జరిగిందని చెప్పారు. చెట్లు కూలిన ప్రాంతంలో వన్య ప్రాణులకు హాని జరగలేదని, విపత్తును ముందే తెలుసుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్టుగా నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. దుర్ఘటనకు గల కారణాలపై నివేదిక రూపొందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కార్యాచరణ చేపడతామని తెలిపారు.

### • ఆరోగ్య ప్రదాత కేసీఆర్

ఇటీవల విడుదలైన ఫలితాల్లో సింగరేణి వైద్య కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. - గోదావరిఖని

### • పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి..

వరంగల్ జిల్లా నెక్కొండలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి కార్మికుల కాళ్లు కడిగారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. నెక్కొండ, ముదిగొండకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు బస్కె శ్రీనివాస్, ఒరుగంటి ప్రమీలను ఘనంగా సత్కరించారు. - నెక్కొండ